ఎక్స్ వేదికగా మాజీ ఎంపీ సంతోష్ పోస్ట్ చేసిన సింహగర్జన సభ నాటి పత్రికల కవరేజీ

సింహగర్జన ర్యాలీలో పాల్గొనడం గర్వకారణం

బీఆర్ఎస్ నేత, మాజీ ఎంపీ సంతోష్‌కుమార్

హైదరాబాద్ మే 17 (నమస్తేతెలంగాణ): 'కరీంనగర్ వేదికగా తెలంగాణ ఉద్యమానికి ఊపిరులూదిన సింహగర్జన సభ ఉద్యమ చరిత్రలో మహోజ్వల ఘట్టం. 24 ఏండ్ల క్రితం హైదారాబాద్ నుంచి కరీంనగర్ వరకు 9 గంటలపాటు నిర్వహించిన ర్యాలీలో పాల్గొనడం గర్వకారణంగా భావిస్తున్నాను' అని బీఆర్ఎస్ నేత, మాజీ ఎంపీ సంతోష్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం ఎక్స్ వేదికగా ఆనాటి స్మృతులను పంచుకున్నారు. దార్శనికుడైన కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ సాకారమైందని పేర్కొన్నారు. 'నాలుగు కోట్ల ప్రజల ఆకాంక్షను నెరవేర్చిన మహోన్నత నేతకు వందనం' అంటూ ట్వీట్ చేశారు. వివిధ పత్రికల్లో ప్రచురితమైన కథనాలు, చారిత్రక సభలో కేసీఆర్ మాట్లాడిన చిత్రాలను ట్యాగ్ చేస్తూ ఆనాటి క్షణాలను గుర్తుచేసుకున్నారు.

సింహగర్జన సభ నాటి పత్రికల కవరేజీ

జాగృతి మహిళా సమాఖ్య రాష్ట్ర కన్వీనర్‌గా మాధవి

మరో నలుగురికి కీలక బాధ్యతలు

నియామకాలు తక్షణం అమల్లోకి

జాగృతి అధ్యక్షురాలు కవిత వెల్లడి

హైదరాబాద్, మే 17 (నమస్తే తెలంగాణ): తెలంగాణ జాగృతి మహిళా సమాఖ్య రాష్ట్ర కన్వీనర్‌గా మరిపెల్లి మాధవి నియమితులయ్యారు. జాగృతి యువజన సమాఖ్య రాష్ట్ర కన్వీనర్‌గా ఎదురుగట్ల సంపత్‌గౌడ్, జాగృతి లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్‌గా అప్పాల నరేందర్ యాదవ్, జాగృతి విద్యార్థి సమాఖ్య రాష్ట్ర కన్వీనర్‌గా జానపాటి రాము యాదవ్, జాగృతి యువజన సమాఖ్య హైదరాబాద్ కన్వీనర్‌గా పరకాల మనోజ్‌గౌడ్ ఎంపికయ్యారు. ఈ నియామకాలు వెంటనే అమల్లోకి వస్తాయని జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత ప్రకటించారు. తెలంగాణ జాగృతిని సంస్థాగతంగా మరింత పటిష్టం చేయడానికి ఈ నియామకాలు చేపట్టామని పేర్కొన్నారు.

పట్టణ మహిళలను సంఘాల్లో చేర్చాలి

- సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

హైదరాబాద్, మే17 (నమస్తే తెలంగాణ): పట్టణ ప్రాంతాల్లోని మహిళలను స్వయం సహాయక సంఘాల్లో చేర్చాలని, అందుకోసం ప్రత్యేక డ్రైవ్ ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. వీహబ్ నిర్వహించిన వుమెన్ యాక్సిలరేషన్ ప్రోగ్రాంలో పాల్గొన్న రేవంత్‌రెడ్డి అనంతరం మాట్లాడుతూ మహిళాశక్తికి చేయూతనిచ్చే అనేక కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్నదని తెలిపారు. స్వయంసహాయక సంఘాల సభ్యుల సంఖ్యను కోటికి పెంచుకోవాలని, వారిని ప్రోత్సహించాలని కోరారు. అనంతరం ఆర్థిక నిపుణుడు, నోబెల్ అవార్డు గ్రహీత అభిజిత్ బెనర్జీ సీఎం రేవంత్‌రెడ్డితో భేటీ అయ్యారు.

దుబాయ్‌లో జరిగిన అంతర్జాతీయ పోలీస్ సమ్మిట్‌లో మాదకద్రవ్యాల నియంత్రణలో భాగంగా మొదటి బహుమతి అందుకున్న సీపీ ఆనంద్‌ను అభినందిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

కేసీఆర్ ఉన్నప్పుడే పింఛన్ టైముకొచ్చేది!

- ఆఫీసర్లు పట్టించుకుంటలేరు: మల్లమ్మ
- ఎమ్మెల్యే ముఠా గోపాల్‌కు ఫిర్యాదు
- పింఛన్ మంజూరుకు ఎమ్మెల్యే హామీ

కవాడిగూడ, మే 17: 'అయ్యా కేసీఆర్ బాగున్నడా.. ఆ సారున్నప్పుడే మాబోటోళ్లకు బాగుండె.. పింఛన్ టైంకిచ్చిండు.. ఇప్పుడు రెండు, మూడు నెలలైనా వస్తలేదు.. ఆఫీసర్లు పట్టించుకుంటలేరు' అని హైదరాబాద్ బొంతలబస్తీకి చెందిన మందరి మల్లమ్మ అనే అవ్వ ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఎదుట తన ఆవేదనను వెళ్లబోసుకున్నది. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ బాగు కోరుకున్నది. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే 'అవ్వా నువ్వు బాధపడకు నేను తహసీల్దార్‌తో మాట్లాడి పింఛన్ మంజూరు చేయిస్తా' అని హామీ ఇచ్చారు. నియోజకవర్గంలోని బోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు వై శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శనివారం ఎమ్మెల్యే ముఠా గోపాల్ వాటర్‌వర్క్స్, మున్సిపల్ అధికారులతో కలిసి రంగానగర్, పాడిమసీద్, గుల్షన్‌నగర్, బొంతలబస్తీ, బంగ్లాదేశ్ మార్కెట్, ఇందిరానగర్ సెకండ్ వెంచర్ తదితర బస్తీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు అభివృద్ధి, సంక్షేమ పథకాలు పేద ప్రజలకు నిరాటంకంగా అందాయని చెప్పారు. ఆచరణ సాధ్యం కాని హామీలను గుప్పించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని నెరవేర్చడం చేతకాక ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నదని విమర్శించారు. అర్హులైన వృద్ధులందరికీ కేసీఆర్ హయాంలో పింఛన్లు సకాలంలో వచ్చాయని, కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉన్న పింఛన్లను తొలగిస్తున్నారని, అర్హులకు పింఛన్లు కూడా ఇవ్వడం లేదని మండిపడ్డారు. అందుకే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల నుంచి తీవ్రస్థాయిలో వ్యతిరేకత వస్తుందని, కేసీఆర్ తిరిగి ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. పాదయాత్రలో గుర్తించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ డీఈ సన్నీ, వాటర్ వర్క్స్ మేనేజర్ శ్రీధర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ దాసు నాయక్, బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జయసింహ, మీడియా ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, నాయకులు శంకర్‌గౌడ్, రహీం, జబ్బర్, చాంద్‌పాషా, మక్బూల్, ఉమాకాంత్, కృష్ణ, ఎల్లేశ్, గోవిందర్‌రాజ్, షకీల్, హజీబాషా తదితరులు పాల్గొన్నారు.



పింఛన్ వస్తలేదని ఎమ్మెల్యే ముఠా గోపాల్‌కు ఫిర్యాదు చేస్తున్న మల్లమ్మ

మెట్రో చార్జీల పెంపు వద్దు

మొదటిపేజీ తరువాయి...

చవకైన, వేగవంతమైన, నమ్మకమైన సేవలందించాల్సిన ప్రజారవాణా వ్యవస్థల ప్రాథమిక లక్ష్యాన్ని నీరుగార్చడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అంతర్జాతీయ నగరాలైన సింగపూర్, బెర్లిన్, టోక్యోల్లో ప్రభుత్వ సబ్సిడీలతో ప్రజా రవాణా వ్యవస్థలు నడుస్తున్నాయని గుర్తుచేశారు. కానీ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని చూస్తుంటే ప్రజారవాణాపై పగబట్టినట్టు స్పష్టమవుతున్నదని విమర్శించారు. విశ్వనగరంగా రూపుదిద్దుకుంటున్న హైదరాబాద్‌లో ప్రజారవాణాను మరింత బలోపేతం చేయాల్సిన అవసరమున్నదని అభిప్రాయపడ్డారు. హైదరాబాద్ మెట్రో కూడా ప్రజల అవసరాలకు అనుగుణంగా పనిచేయాలి తప్ప ప్రైవేట్ కంపెనీల లాభాల కోసం కాదనే విషయాన్ని సర్కారు గుర్తించాలని సూచించారు. చార్జీల పెంపు ద్వారా ఇన్నాళ్లుగా మెట్రో సేవలను ఉపయోగించుకుంటున్న లక్షలాది మంది ఉద్యోగులు, యూనివర్సిటీ, కాలేజీల విద్యార్థులు ఇతర రవాణా మార్గాలకు మళ్లే అవకాశం ఉన్నదని పేర్కొన్నారు.

జీవనం దుర్భరం చేశారు

'కాంగ్రెస్ సర్కారు హైడ్రా, మూసీ పేరిట సాగించిన విధ్వంసంతో వీధి వ్యాపారులు, పేదల బతుకులు కుదేలయ్యాయి. కమీషన్ల వేటలో రియల్ ఎస్టేట్‌ను ఆగం చేసి ఉపాధి అవకాశాలను దెబ్బతీశారు. ఆర్థిక ఇంజిన్ అయిన హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను కుప్పకూల్చారు. ఇలాంటి అనేక సవాళ్ల మధ్య బతుకు పోరాటం చేస్తున్న బడుగు జీవులపై మెట్రో చార్జీల రూపంలో భారం మోపడం దుర్మార్గం' అని బీఆర్ఎస్ శాసనసభ్యులు దుయ్యబట్టారు. కాంగ్రెస్ ఎక్కడ అధికారంలో ఉంటే అక్కడ మెట్రో చార్జీలను పెంచడం రివాజుగా మారిందని ఆరోపించారు. బెంగళూరులో 100 శాతం చార్జీల పెంపుతో ప్రయాణికులు 13 శాతం తగ్గిపోయారని గుర్తుచేశారు. ఈ పరిస్థితుల్లో అక్కడి ప్రభుత్వం పెంపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా పునరాలోచించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్‌పై కోపంతో అవసరమైన ప్రాంతాలకు మెట్రోను రద్దుచేసిన ప్రభుత్వం, మళ్లీ ఇప్పుడు విస్తరణ రాగం అందుకోవడాన్ని చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా తప్పులు తెలుసుకొని చార్జీల పెంపును వెనక్కి తీసుకోవాలని, లేదంటే హైదరాబాద్ నగరవాసులు క్షమించబోరని హెచ్చరించారు.

మహానగరంపై పగబట్టిన రేవంత్

మెట్రో చార్జీల పెంపుతో ప్రజలపై అదనపు భారం: ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

హైదరాబాద్, మే 17 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ మహానగరంపై సీఎం రేవంత్ పగబట్టారని బీఆర్ఎస్ ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇప్పటికే మూసీ ప్రక్షాళన, హైడ్రా పేరుతో నగర ప్రజలకు అనేక సమస్యలు సృష్టించిన సీఎం.. తాజాగా మెట్రో రైలు చార్జీలను పెంచి పేద, మధ్యతరగతి ప్రజలపై అదనపు భారం మోపారని విమర్శించారు. శనివారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. నగరంలోని మెట్రో రైలులో ప్రతి టిక్కెట్‌పై అదనంగా రూ.20 వరకు పెంచారని, దీంతో మెట్రో ప్రయాణికుడికి ప్రతినెలా రూ.600కు పైగా అధిక భారం పడుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. కొన్ని నగరాల్లో మెట్రోచార్జీల పెంపుపై అక్కడి ప్రయాణికుల తిరుగుబాటుతో ప్రభుత్వాలు ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నాయని గుర్తుచేశారు. హైదరాబాద్ మెట్రో రైలు చార్జీల పెంపు నిర్ణయాన్ని కూడా వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ అభివృద్ధికి పాటుపడాలని, తిరోగమనం వైపు తీసుకెళ్లే ఏ నిర్ణయమూ మంచిది కాదని హితవు పలికారు. ఇప్పటికే ప్రతిపాదించిన కొత్త మెట్రో రైలు మార్గాల నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ హయాంలో ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా, కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో, మెట్రో రైలు నష్టాల్లో నడిచినా.. చార్జీలను మాత్రం పెంచలేదని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి గుర్తుచేశారు. ప్రజా రవాణాకు ఎన్ని సబ్సిడీలు ఇచ్చినా తక్కువే అని చెప్పారు. నగర పరిధిలో రియల్ ఎస్టేట్ రంగం నష్టాల్లో కూరుకుపోయిందని, ఈ దశలో నగర ప్రజలపై అదనపు భారాలు మోపడం సరికాదని సూచించారు.

'పాలమూరు'కు నిధులేవీ?

- కేసీఆర్ హయాంలోనే 90 శాతం పనులు పూర్తి
- మిగిలిన పది శాతం పనులు కూడా చేయలేరా?
- ప్రాజెక్టుపై కక్ష పూరితంగానే సీఎం రేవంత్ నిర్లక్ష్యం
- మీడియాతో కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తిలో మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కల్వకుర్తి, మే 17 : పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులు కేసీఆర్ ప్రభుత్వంలో 90 శాతం పూర్తయ్యాయని, మిగిలిన 10 శాతం పూర్తి చేయడంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం సిగ్గుచేటని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ధ్వజమెత్తారు. శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తిలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జైపాల్ మాట్లాడారు. కల్వకుర్తి ప్రాంతానికి చెందిన మాజీ కేంద్ర మంత్రి జైపాల్‌రెడ్డి పేరును పాలమూరు-రంగారెడ్డి పథకానికి పెట్టి చివరి దశలో ఉన్న పనులపై శ్రద్ధ పెట్టకపోవడం చూస్తుంటే ఉద్దేశపూర్వకంగానే నిర్లక్ష్యం చేస్తున్నారని అర్థమవుతున్నదని తెలిపారు. కల్వకుర్తిలో జైపాల్‌రెడ్డి విగ్రహావిష్కరణ సభలో తనకు రాజకీయ జన్మనిచ్చిన కల్వకుర్తిని అభివృద్ధి పథంలో ముందంజలో ఉంచుతానని సీఎం రేవంత్ ప్రకటించినా.. నేటికీ కొత్త పనులకు నయాపైసా కేటాయించకపోవడం విడ్డూరంగా ఉందని చెప్పారు. కేసీఆర్ హయాంలోనే కల్వకుర్తికి 100 పడకల దవాఖాన, ట్రామాకేర్ సెంటర్ మంజూరైందని గుర్తుచేశారు. నిధులు కేటాయిస్తే పనులు ప్రారంభమవుతామని తెలిపారు. కొడంగల్‌కు మెడికల్ కళాశాల, నారాయణపేట-కొడంగల్‌కు పీఆర్ఎల్ఐ ద్వారా సాగునీళ్లు అందించేందుకు రూ.4 వేల కోట్లు కేటాయించారని, పుట్టినగడ్డ ఏం పాపం చేసిందని ప్రశ్నించారు. కల్వకుర్తికి మెడికల్, ఇంజినీరింగ్ కళాశాలలు మంజూరు చేయడంతో పాటు పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు.

బుమ్రుక్నుదౌలా ట్యాంక్‌లో మట్టిని తొలగించాలి

- పిటిషనర్‌కు హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, మే17 (నమస్తే తెలంగాణ): రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ మండలం బుమ్రుక్నుదౌలా ట్యాంక్ ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న మట్టి, ఇతర సామగ్రిని తొలగించాలని ఓ పిటిషనర్‌కు హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. ఒకవేళ పిటిషనర్ తొలగించకపోతే వచ్చే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని హైడ్రా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ మండలంలో సర్వే నం.42లో 3.03 ఎకరాలు, సర్వే నం.50/1లో 9.24 ఎకరాలను కొనుగోలు చేశానని, ఇందులో జోక్యం చేసుకోకుండా హైడ్రాతో సహా అధికారులను ఆదేశించాలని మహ్మద్ ఇబ్రహీం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ కే లక్ష్మణ్ విచారణ చేపట్టారు. పిటిషనర్ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ మరో ప్రైవేటు వ్యక్తి ఫిర్యాదుతో అధికారులు జోక్యం చేసుకుంటున్నారని, దీనిపై సివిల్ కోర్టు ఆదేశాలున్నాయని చెప్పారు. వాదనలను విన్న న్యాయమూర్తి చెరువులో వేసిన మట్టిని పిటిషనర్ సొంత ఖర్చుతో తొలగించాలని ఆదేశించారు.

మెడికోల 'స్టైపెండ్' పోరు

- ప్రైవేట్ మెడికల్ కాలేజీల విద్యార్థులను తీవ్రంగా వేధిస్తున్న యాజమాన్యాలు
- ఎన్ఎంసీ నిబంధనలు బేఖాతరు
- స్టైపెండ్ ఎందుకు ఇవ్వడం లేదని అడిగితే ఇంటర్న్‌షిప్ పాడిగిస్తామంటూ బెదిరింపులు
- నీట్ పీజీకి అర్హత కోల్పోతామని విద్యార్థుల ఆందోళన

హైదరాబాద్, మే 17 (నమస్తే తెలంగాణ): తెలంగాణలోని ప్రైవేటు మెడికల్ కాలేజీల విద్యార్థులు తమకు న్యాయంగా దక్కాల్సిన స్టైపెండ్‌ను చెల్లించాలని సోషల్ మీడియా వేదికగా గళమెత్తారు. తమ సేవలకు సరైన ఆర్థిక సాయం అందడం లేదని ఆసుపత్రుల్లో పనిచేస్తున్న ఇంటర్న్‌లు, పీజీ మెడికల్ విద్యార్థులు వాపోతున్నారు. జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) నిబంధనల ప్రకారం ప్రతి నెలా రాష్ట్రంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లోని విద్యార్థులకు చెల్లిస్తున్నట్టుగానే ప్రైవేటు కాలేజీల్లో చదువుతున్న యూజీ (ఇంటర్న్‌షిప్ చేస్తున్న) విద్యార్థులకు రూ.25,906, పీజీ వైద్య విద్యార్థులకు రూ.50 వేల నుంచి రూ.80 వేల వరకు స్టైపెండ్ చెల్లించాల్సి ఉంటుంది. అయితే ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలు మాత్రం అడ్మిషన్ల సమయంలోనే ఏడాదికి కొంత చొప్పున విద్యార్థుల నుంచే స్టైపెండ్ ఫీజుగా వసూలు చేస్తున్నాయి. ఆ డబ్బులనే ప్రతి నెలా విద్యార్థులకు రూ.2 వేల నుంచి రూ.5 వేల వరకు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నాయి. దీంతో తమకు న్యాయంగా దక్కాల్సిన స్టైపెండ్‌ను ఎందుకు ఇవ్వడం లేదని ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలను ప్రశ్నిస్తే బెదిరింపులకు దిగితున్నట్టు విద్యార్థులు ఆరోపిస్తున్నారు. స్టైపెండ్ అడుగుతున్న విద్యార్థులను యాజమాన్యాలు టార్గెట్ చేస్తున్నాయని, ఏడాదిలో పూర్తి కావాల్సిన ఇంటర్న్‌షిప్‌ను ఉద్దేశపూర్వకంగా మరో 2-3 నెలలు పొడిగిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో తాము అనుకున్న సమయానికి ఇంటర్న్‌షిప్ పూర్తికాదని, అదే జరిగితే నీట్ పీజీకి అర్హత కోల్పోతామని వాపోతున్నారు.

బ్లాంక్ చెక్కులపై సంతకాలు

వైద్య విద్యార్థులకు అందుతున్న స్టైపెండ్ వివరాలను ప్రైవేట్ మెడికల్ కాలేజీలు ఎప్పటికప్పుడు ఆధారాలతో సమర్పించాలని ఎన్ఎంసీ కోరుతున్నది. అయితే ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలు విద్యార్థులకు ఇంటర్న్‌షిప్, పీజీ కోర్సు ప్రారంభం కాగానే బ్లాంక్ చెక్కులపై సంతకాలు తీసుకుంటున్నాయి. విద్యార్థుల అకౌంట్‌లో స్టైపెండ్ పడగానే బ్లాంక్ చెక్కుల ద్వారా ఆ డబ్బులను తమ ఖాతాలోకి మళ్లించుకుంటున్నాయి. కొన్ని ప్రైవేట్ కాలేజీల్లో తమకు కనీస మౌలిక సదుపాయాలతోపాటు అధ్యాపకులు కూడా లేరని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. వైద్యవిద్యార్థులకు సక్రమంగా స్టైపెండ్ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం, మెడికల్ కౌన్సిల్ తరఫున ఆదేశిస్తున్నప్పటికీ ప్రైవేటు కాలేజీలు లెక్కచేయడం లేదు. ఈ విషయాన్ని విద్యార్థులు ఇప్పటికే పలుమార్లు డీఎంఈ, అకడమిక్ డీఎంఈ, తెలంగాణ మెడికల్ కౌన్సిల్ (టీజీఎంసీ) దృష్టికి తీసుకెళ్లడంతోపాటు తమకు స్టైపెండ్ అందడం లేదని ఈ-మెయిళ్ల ద్వారా ఎన్ఎంసీకి ఫిర్యాదు చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపి తమ సమస్యను వెంటనే పరిష్కరించాలని వైద్య విద్యార్థులు కోరుతున్నారు.

జీఆర్ఎంబీలో ఇష్టారాజ్యం!

రాష్ట్ర అధికారులంటే లెక్కలేని గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు • నిబంధనలకు పాతరేసి ఏకపక్ష నిర్ణయాలు

- బోర్డు మెంబర్ సెక్రటరీ అజగేశన్‌దే పెత్తనం
- ఇప్పటికే తెలంగాణకు చెందిన ముగ్గురు ఉద్యోగుల రిలీవ్
- వేరొకరిని డిప్యూట్ చేసేవరకూ వేచి చూడాలన్నా వినని దుస్థితి
- సిబ్బంది మొర ఆలకించని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం

హైదరాబాద్, మే 17 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక గోదావరి నదీ యాజమాన్య బోర్డు (జీఆర్ఎంబీ)లోనూ తెలంగాణ పరపతి దిగజారిపోయింది. తెలంగాణ అధికారులంటేనే ఏ మాత్రం లెక్కచేయని దుస్థితి అక్కడ నెలకొన్నది. నిధుల ఖర్చు, ఇతరత్రా అంశాలపై అసలు రాష్ట్రానికి అడిగే హక్కు లేదంటూ బోర్డు బాహాటంగా చెబుతున్నదంటే పరిస్థితి ఎంత దయనీయంగా మారిందో అర్థం చేసుకోవచ్చు. రాష్ట్ర ప్రభుత్వం, జీఆర్ఎంబీలోని తెలంగాణ అధికారులు ఎన్ని ఫిర్యాదులు చేసినా బోర్డు బుట్టదాఖలు చేయడమేగాక, తిరిగి సదరు అధికారులపైనే కక్ష సాధింపు చర్యలకు పూనుకుంటున్నది. ఇంత జరుగుతున్నా కాంగ్రెస్ సర్కారు మాత్రం చోద్యం చూస్తున్నదని రాష్ట్ర ఇంజినీర్లు, బోర్డులోని తెలంగాణ అధికారులు వాపోతున్నారు.

ఈఎన్సీకి అధికారాల్లేవట

ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం తెలంగాణ, ఏపీ రాష్ట్రాల మధ్య కృష్ణా, గోదావరి నదీ జలాల పంపిణీ, వివాదాల పరిష్కారానికి రివర్ బోర్డులను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఆ బోర్డుల్లో చైర్మన్, మెంబర్ సెక్రటరీతోపాటు ఇద్దరు మెంబర్లను కేంద్ర ప్రభుత్వం నియమిస్తుంది. మిగతా బోర్డు సెక్రటేరియట్‌లో రెండు రాష్ట్రాల నుంచి ఎస్ఈ, ఈఈ, డీఈఈ, ఏఈఈలను సమాన నిష్పత్తిలో నియమిస్తారు. రివర్ బోర్డు అనేది కేవలం రెండు రాష్ట్రాలను సమన్వయం చేసుకుంటూ వివాదాలను పరిష్కరించే ఒక ఏర్పాటు మాత్రమే. ఏ అంశంలోనైనా రాష్ట్రాలదే అంతిమ నిర్ణయం. కానీ జీఆర్ఎంబీ మాత్రం అందుకు విరుద్ధంగా అజమాయిషీ చెలాయిస్తున్నది. రాష్ట్రాల హక్కులను కాలరాస్తున్నది. ముఖ్యంగా బోర్డు మెంబర్ సెక్రటరీ తీరు నానాటికీ శ్రుతి మించిపోతున్నదని అధికారులు చెప్తున్నారు. రెండు రాష్ట్రాలు తమకు నచ్చిన, అంతర్రాష్ట్ర వివాదాలతోపాటు బేసిన్‌పై అవగాహన ఉన్న నిపుణులైన అధికారులను డిప్యుటేషన్‌పై బోర్డులో నియమించుకుంటాయి. అది రాష్ట్రాల హక్కు. దానిని జీఆర్ఎంబీ తుంగలో తొక్కుతున్నది. ఇటీవల ఆ బోర్డులో తెలంగాణకు చెందిన ఓ మహిళా అధికారి డిప్యుటేషన్ కాలం పూర్తయింది. దీంతో అధికారిణి సేవలను వినియోగించుకోవాలనే ఉద్దేశంతో రాష్ట్ర సాగునీటిపారుదలశాఖ ఈఎన్సీ (అడ్మిన్) ఆమె డిప్యుటేషన్‌ను మరో ఏడాదిపాటు పొడిగించారు. కానీ, ఆ నిర్ణయాన్ని తప్పుబడుతూ, తెలంగాణను అవహేళన చేస్తూ బోర్డు మెంబర్ సెక్రటరీ ఏకంగా ఓ లేఖ రాశారు. అంతేకాకుండా డిప్యుటేషన్లను కొనసాగించే అధికారం ఈఎన్సీకి లేదని, డిప్యుటేషన్ పొడిగింపును ఒప్పుకోబోమని తేల్చిపారు. ఇటీవల బోర్డులోని ఓ సూపరింటెండెంట్ డిప్యుటేషన్ కాలం పూర్తవడంతో మరొకరిని పంపించే వరకూ వేచిచూడాలని బోర్డుకు ఈఎన్సీ లేఖ రాశారు. కానీ, ఆ అధికారమే ఈఎన్సీకి లేదని బోర్డు మెంబర్ సెక్రటరీ మరోసారి తేల్చిచెప్తూ సదరు సూపరింటెండెంట్‌ను ఏకపక్షంగా రీలివ్ చేశారు.

ఫిర్యాదు చేసినవారిపై కక్ష సాధింపులు

జీఆర్ఎంబీ మెంబర్ సెక్రటరీ అజగేశన్ మహిళలను లైంగిక వేధింపులకు గురిచేయడమేగాక, అనేక ఆర్థిక అవకతవకలకు పాల్పడుతున్నారని కొన్ని రోజులుగా ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. మహిళా ఉద్యోగుల డ్రెస్సింగ్ స్టయిల్‌పై అసభ్యకర వ్యాఖ్యలు చేయడంతోపాటు, వారాంతాల్లో లంచ్ లేదా డిన్నర్ కోసం ఇంటికి పిలవాలంటూ వారిని ఒత్తిడి చేస్తున్నట్టు బోర్డు ఉద్యోగులు చెప్తున్నారు. అంతేకాకుండా ట్రాన్స్‌పోర్ట్ అలవెన్సు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఎంపిక విషయంలోనూ అజగేశన్ అవకతవకలకు పాల్పడ్డారని ఆరోపిస్తున్నారు. ఆ వ్యవహారాలపై బోర్డులోని ఏపీ, తెలంగాణ ఇంజినీర్లు, ఉద్యోగులు జీఆర్ఎంబీ చైర్మన్‌తోపాటు కేంద్ర జల్‌శక్తి శాఖకు ఫిర్యాదు చేశారు. ఇటీవల నిర్వహించిన బోర్డు సమావేశంలో కూడా మెంబర్ సెక్రటరీ తీరుపై తెలంగాణ ఈఎన్సీ అనిల్‌కుమార్ తీవ్రంగా స్పందించారు. అజగేశన్ ఆర్థిక అవకతవకలు, లైంగిక వేధింపులపై విచారణ జరిపి నిజాలను నిగ్గుతేల్చేందుకు రెండు రాష్ట్రాల సీఈలు, బోర్డు నుంచి ఒక మెంబర్‌తో కమిటీ వేయాలని పట్టుబట్టారు. ఆ డిమాండ్‌కు బోర్డు చైర్మన్ సైతం అంగీకరించారు. కానీ ఇప్పటివరకు ఎలాంటి కమిటీని ఏర్పాటు చేయలేదు. అజగేశన్‌పై వచ్చిన ఫిర్యాదులపై కేంద్ర జల్‌శక్తి శాఖ సైతం స్పందించలేదు. దీంతో ఇదే అదునుగా ఆయన మరింత రెచ్చిపోతున్నారు. తనపై ఫిర్యాదు చేసిన బోర్డు ఉద్యోగులపై కక్ష సాధింపు చర్యలకు దిగి, చిన్నచిన్న విషయాలపై మెమోలు జారీచేయడం మొదలుపెట్టారు. అంతేకాకుండా బోర్డులో డిప్యుటేషన్ పూర్తయిన సిబ్బందిని ఏకపక్షంగా పంపించేస్తున్నారు. అలా తెలంగాణకు సంబంధించి ముగ్గురితోపాటు ఏపీకి చెందిన వారిని కూడా రిలీవ్ చేసినట్టు తెలిసింది. అజగేశన్ కక్ష సాధింపులకు తాళలేక పలువురు బోర్డు ఉద్యోగులే స్వచ్ఛందంగా డిప్యుటేషన్‌ను రద్దు చేసుకుంటున్నారు. దీన్నిబట్టే బోర్డులో పరిస్థితి ఎలా ఉన్నదో అర్థం చేసుకోవచ్చు.

పట్టించుకోని కాంగ్రెస్ సర్కారు

జీఆర్ఎంబీలో పరిస్థితి నానాటికీ దిగజారుతున్నా, మెంబర్ సెక్రటరీ ఆగడాలు శృతి మించినా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోకపోవడంపై తెలంగాణ ఉద్యోగులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి భరోసా దక్కడం లేదని వాపోతున్నారు. పర